క్లుప్తంగా

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష రేపు

కావలి: మండలంలోని ఒట్టూరు ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ ఇందిర శనివారం తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలని, 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలకు 70329 96502 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 281

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్టంగా రూ.281 ధర పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 365 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 261 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 104 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.281, కనిష్టంగా రూ. 220, సగటున రూ.252.40 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్ కుమార్ వివరించారు.

చలివేంద్రం ప్రారంభం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి ఏ వెంకటరమణయ్య శనివారం ప్రారంభించారు. ట్రస్టు సభ్యులు బీ వెంకటేశ్వర్లు, జీ రమేష్,షేక్ జానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వింజమూరులోని మాసిలామణి వైద్యశాలలో కాలేయ సంబంధిత వ్యాధులతో శనివారం అవగాహన కల్పించారు. విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రశాంత్,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

కావలి: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణంలోని శంకరన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ నూకసాని బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జవహర్ భారతి, విశ్వోదయ ఆశయాలు, ఆదర్శాలను అందిపుచ్చుకుని జీవితంలో ఎదిగానని పేర్కొన్నారు. కళాశాల కళాశాల కరస్పాండెంట్ వీ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పీ సుబ్రహ్మణ్యంనాయుడు, కళాశాల స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్ మాల్యాద్రి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ పీ ప్రసాద్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేర్ బ్యూలా, తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిల్లో తనిఖీలు

కావలి : ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని లాడ్జిల్లో ఎస్సై శెట్టిపల్లి సుమన్ తన సిబ్బందితో కలిసి శనివారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల జిల్లాలో హత్యలు, దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న స్వర్ణ లాడ్జి, హోటల్ మౌర్య, ఎన్ఎంజే లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉంటున్నారా అని లాడ్జిల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వే అధికారికి సన్మానం

బిట్రగుంట: బిట్రగుంట ఐఓడబ్ల్యూ అధికారి రాజేష్‌ను కొత్తూరు గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించారు. బిట్రగుంట రైల్వే స్టేషన్ నుంచి కొత్తూరుకు వెళ్లే మార్గం సరిగా లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చేలా రాజేష్ కృషి చేయడంతో కొత్తూరు గ్రామస్తులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

కనకమ్మ మృతికి సంతాపం

కావలి: గుడ్లూరు మండలానికి చెందిన సీపీఎం నాయకురాలు కూరపాటి కనకమ్మ శనివారం మృతి చెందడంపై ఆ పార్టీ కావలి నాయకులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఎం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ గడ్డం మాల్యాద్రి, రాయి మాలాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాధాకష్ణయ్య, కార్మిక సంఘం మండలాధ్యక్షుడు పేముల సీతారామయ్య, పట్టణ సీపీఎం కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, బోగోలు మండల నాయకులు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

వరికుంటపాడు: మండలంలోని జీ కొండారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీలు పుల్లమ్మ, విజయలక్ష్మి పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు సుబ్బలక్ష్మి, భవానీ, శాంతి, సుజాత, రూతమ్మ, తదితరులు పాల్గొన్నారు.


వీధిలో గుంపుగా తిరుగుతున్న కుక్కలు

భౌ౦బో౦య్

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం
- మనుషులతో పాటు మూగజీవాలపైన దాడి
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- కానరాని సంతాన నిరోధక చర్యలు
- ఆందోళనలో ప్రజలు

కొండాపురం : మండలవాసులను వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. యథేచ్ఛగా దాడులకు పాల్పడుతూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మనుషులతో పాటు మూగజీవాలపైన దాడి చేసి కాటేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి ప్రమాదాల పాల్జేస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి సరాసరి. మొత్తంగా వీధి కుక్కల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగోతోంది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా గ్రామసింహాల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కొమ్మి, పార్లపలి, కొండాపురం, తూర్పుఎర్రబల్లి, గరిమెనపెంట, సాయిపేట, తదిత గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గత మూడు నెలల వ్యవధిలో కొండాపురం పీహెచ్‌సీ పరిధిలో 60కుపైగా కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. దీనిని బట్టి చూస్తే మండలంలో కుక్కల బెడద ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. ఇలా నిత్యం మండలంలోని ఏదోక గ్రామంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు కుక్క కాటుకు గురవుతున్నారు. అంతేగాకుండా మూగజీవాలు, పశువులపైన కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలు ఉన్నాయి. కుక్కల దాడి చేసి మూగజీవాలను హతమారుస్తుండడంతో వాటి పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు గ్రామాల్లో కోతులు మందలు, మందలుగా వచ్చి ఇళ్లలోకి చొరబడి నానాబీభత్సం సృష్టిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలాధికారులు స్పందించి కుక్కలు, కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మూగజీవాలపై దాడిచేసి హతమారుస్తున్నాయి. మనుషులను కాటేస్తున్నాయి. మండలాధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

–ఎం మాధవరావు, లింగన్నపాళెం


నడిచి వెళ్తున్న వ్యక్తి వెంట పడుతున్న కుక్కలు

గ్రూపులు..గొడవలే చిలకపాటి నైజం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు

బిట్రగుంట: బోగోలు మండల టీడీపీ నాయకుడు చిలకపాటి వెంకటేశ్వర్లు నిత్యం గ్రూపులు కట్టి గొడవలు సృష్టించడమే నైజంగా పెట్టుకున్నాడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు విమర్శించారు. బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా వచ్చిన అధికార మదంతో, పదవుల పందేరంలో ముందుండాలనే ఆశతో స్థాయికి మించి తనపైన, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపైన విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు. చిలకపాటి మాటలను కూటమి నాయకులు కూడా నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. తనపై చేసిన ఆరోపణలు దమ్ముంటే నిరూపించాలని చిలకపాటికి సవాల్ విసిరారు. చిలకపాటిపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ఆధారాలతో సహానిరూపిస్తానని స్పష్టం చేశారు. చిలకపాటి వారసత్వంగా వచ్చిన భూములంటూ గంగమ్మ మాన్యాన్ని అప్పనంగా అనుభవిస్తున్నాడని ఆధారాలతో సహావివరించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు స్వయంగా పూనుకుని గంగమ్మ మాన్యం భూములకు విముక్తి కల్పించాలని కోరారు. మరోసారి తనపైన, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపైన స్థాయికి మించి ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల శ్రీనివాసులు, తదితరులు మాట్లాడుతూ చిలకపాటి వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అబద్ధాలతో పబ్బం గడుపుకోవాలని చూస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకే సుందర్‌రాజు, తుమ్మల రమణయ్య నాయుడు, గోపిశెట్టి వెంకయ్య, కుందుర్తి వేణుగోపాల్, గుత్తి సుధాకర్, కోటపల్లి సాగర్, మిట్టా పిచ్చయ్య, పోతల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల శ్రేయస్సుకు చర్యలు

కలిగిరి: పొగాకుకు గిట్టుబాటు ధరలు లభించేలా చూసి పొగాకు రైతుల శ్రేయస్సుకు చర్యలు తీసుకుంటామని పొగాకుబోర్డు వైస్‌చైర్మన్ బీ బ్రహ్మయ్య తెలిపారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను శనివారం ఆయన పరిశీలించారు. పొగాకు కొనుగోలు చేసే కంపెనీల ప్రతినిధులతో చర్చించారు. ఈ ఏడాది నాణ్యమైన పొగాకు దిగుబడులు వచ్చిన నేపథ్యంలో వేలంలో మంచి ధరలకు పొగాకును కొనుగోలు చేయాలని సూచించారు. రైతుల శ్రేయష్సుకు పొగాకు బోర్డు పూర్తి సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్, కంపెనీల ప్రతినిధులు, పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న పొగాకుబోర్డు వైస్‌చైర్మన్ బీ బ్రహ్మయ్య

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కావలి: రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ నాయకులు కరవది భాస్కర్, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎల్ లక్ష్మారెడ్డి, ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి గోసాల రవికాంత్ తదితరులు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించడం వారి ఆస్తులకు రక్షణ లేకుండా చేయడమేనన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి చంద్రబాబు మద్దతు తెలిపి ముస్లింల గొంతుకోశాడని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు కోసం దేశవ్యాప్తంగా ముస్లింలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం వక్ఫ్‌భూములను 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడం అన్యాయమన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు అయ్యేంత వరకు ముస్లింలకు మద్దతుగా వామపక్షాలు పోరాడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, దర్గా బాబు, బోసు, ఎల్ శ్యామల, కృష్ణమోహన్, బీ కృష్ణయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

విద్యతో ఉన్నత శిఖరాలు

ఉదయగిరి: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బండగానిపల్లి పంచాయతీ పరిధిలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి హెచ్‌ఎం నాయబ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు జరపడం అభినందనీయమన్నారు. అనంతరం స్కూల్ కాంప్లెక్స్ నిధులతో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు ట్రంకు పెట్టెలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఆటవస్తువులు అందజేశారు. అనంతరం ఎంఈఓ,హెచ్‌ఎంను గ్రామస్తులు,ఉపాధ్యాయులు సన్మానించారు. సర్పంచ్ లక్కు రమణమ్మ, విశ్రాంత ఎంఈఓ జీ ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు,సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాలలకు ఆట వస్తువులు అందజేస్తున్న ఎంఈఓ, సర్పంచ్

నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయండి

ఆత్మకూరు: సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు, రెవెన్యూ సిబ్బంది నీటి తీరువా వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని అన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సాగునీటి సంఘాల కార్యవర్గ సభ్యులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందికి నీటి తీరువా వసూళ్లపై అవగాహన సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పావని మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల రైతులకు ప్రభుత్వం తొలికారు పంటకు సమృద్ధిగా సాగునీటిని సరఫరా చేసిందని తెలిపారు. సోమశిల జలాశయంలో నీటి లభ్యత ఉన్న దృష్ట్యా ఎంపిక చేసిన మండలాలకు రెండో పంటకు నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సాగునీటి కాలువల్లో పూడికతీత, దెబ్బతిన్న అక్విడెట్ల నిర్మాణం, తదితర పనుల నిర్వహణకు నీటి తీరువా పన్నులను వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు అవగాహన కల్పించి నీటి తీరువా వసూళ్లకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్ట్ కమిటీ సభ్యుడు వీ కేశవచౌదరి, ఎంపీపీలు, ఎంపీడీఓలు, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లిలో ప్రవాస భారతీయురాలు డాక్టర్ ప్రమీల మదమాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మందికిపైగా రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఆలంబన ఫౌండేషన్ సహకారంతో రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి , అల్లంపాటి రాజేష్‌రెడ్డి, ఏఎన్ఎం షంషాద్‌బేగం, మహిళా పోలీస్ సుప్రజ, ఆశావర్కర్ కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



ఆత్మకూరు: విద్యార్థులు చిన్న సేవా భావాన్ని అలవర్చుకోవాలని శ్రీనివాస పాఠశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు అన్నారు. మున్సిపల్ పరిధిలోని జమ్మలపాళెం, గిరిజనకాలనీలోని 70 గిరిజన కుటుంబాలకు 5 కేజీలు చొప్పున బియ్యాన్ని పట్టణంలోని శ్రీనివాస పాఠశాల విద్యార్థులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని అలవర్చేందుకు విద్యార్థులతో మూడేళ్ల క్రితం అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. అందులో భాగంగా ప్రతి గురువారం ప్రతి విద్యార్థి రెండు పిడికిళ్ల బియ్యాన్ని తమ ఇంటి వద్ద నుంచి తెచ్చి పాఠశాలలోని ఓ పాత్రలో నిల్వ ఉంచుతారని చెప్పారు. అలా నిల్వ ఉంచిన బియ్యాన్ని ఏడాదిలో రెండుసార్లు పేద కుటుంబాలకు 5 కేజీలు చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు.

శ్మశానవాటిక దారి ఆక్రమణపై పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం ముత్తుకూరులో శ్మశానవాటిక దారి ఆక్రమణలను తహసీల్దార్ సుభాషిణి శనివారం పరిశీలించారు. ఎస్సీ కాలనీవాసులు శ్మశానవాటిక దారి ఆక్రమణపై వినతిపత్రం అందజేయడంతో ఆక్రమణలను పరిశీలించి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ కరిముల్లా ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు న్యాయం

సీతారామపురం: ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు న్యాయం చేకూరిందని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు సీతారామపురంలో విలేకరులతో మాట్లాడారు. గత ముప్పై ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆయన సుదీర్ఘ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకర సాధ్యమైందన్నారు. ఎస్సీలను ఏ, బీ,సీ,డీలుగా విభజించడం వల్ల 59 ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపడం, రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు రిజర్వేషన్లను అమలు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు ఎలీషాకుమార్, జాషువా, ఇశ్రాయిల్, రాజేష్ జయరావు, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక లారీలతో స్తంభిస్తున్న ట్రాఫిక్

సంగం: మండల కేంద్రమైన సంగంలో పెన్నా నది నుంచి ఇసుకను తరలించే లారీలు, టిప్పర్లతో ప్రతినిత్యం రాత్రి వేళల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. సంగం బస్టాండ్ సెంటర్ వద్ద రాత్రి వేళల్లో పోలీసులు ఉండకపోతుండడంతో ఇసుక లారీలు, టిప్పర్లతో పాటు ఆటోలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభిస్తోంది. శనివారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో దాదాపు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


సంగంలో నిలిచిన ట్రాఫిక్

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

ఉదయగిరి: అప్రమత్తతతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. బహుళ అంతస్తుల భవనాల్లో ప్రమాదాలు జరిగితే ఎలా రక్షించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. వైద్యులు ప్రశాంతకుమార్, అనీస్ సల్మా, ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు


ఉదయగిరిలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


దుత్తలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పీ గంగాప్రసాద్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ వేస్ట్ గదిని శనివారం ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. వాటిని సేకరించి ప్రత్యేకంగా రీసైక్లింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందు కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణ ప్రజలు పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, సీఐ జీ గంగాధర్, ఎంపీఐ రాములు, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, చెర్లోయడవల్లిలో ఉపాధి ఏపీడీ శంకర్ నారాయణ, ఈఓపీఆర్డీ డేవిడ్, వాశిలిలో డీఎల్‌పీఓ నయీంతాజ్ ఆధ్వర్యంలో ఈ–వేస్ట్‌పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇళ్లలోని పాడైపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పంచాయతీ సిబ్బందికి అందజేయాలని సూచించారు.

ఉదయగిరి: పట్టణంలో విద్యార్థులతో కలిసి పోలీసులు ఈ వేస్ట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సైలు కే ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి పాడైపోయిన టీవీలు, మొబైల్స్ బ్యాటరీలు, తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రిసైక్లింగ్ కేంద్రాల్లో అందజేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని చెత్త, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు.

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులో ఎంపీడీఓ మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ వేస్ట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఎంఈఓ వెంగయ్య, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మురళీమోహన్‌రెడ్డి, హెచ్‌ఎం నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి షేక్ నజిముల్లా పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు, పోలీసు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఎస్సై రఘునాథ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిరక్షించుకోవాలన్నారు.

సీతారామపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఈ వేస్ట్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ భార్గవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ఎంఈఓ మస్తాన్‌వలీ, వెలుగు సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఈ–వేస్ట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అల్లూరుపేట సత్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సీతారామపురం: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎస్సై శివకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక గౌతమి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్స్, స్వచ్ఛాంధ్ర, తదితర అంశాలపై శనివారం ఆయన అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలతో తలెత్తే అనర్థాలు, డయల్ 100, 112, ఫోక్సోయాక్ట్, శక్తి యాప్, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

సీతారామపురం: సీతారామపురంలోని మద్యం దుకాణాలను నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి మద్యం నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలని, షాపుల నిర్వహణలో సమయాన్ని పాటించాలని సూచించారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.